క్లుప్తంగా

దేవీ నవరాత్రుల ఏర్పాట్లకు రాట



కనకదుర్గమ్మ ఆలయం వద్ద రాట పాతుతున్న ఆలయ కమిటీ సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం నాచువారి సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల ప్రారంభ పందిర రాట ముహూర్తాన్ని బుధవారం నిర్వహించారు. ఒంటెద్దు బళ్ల సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ విజయదశమి వరకు అమ్మవారికి విశేష పూజలు, ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలు, కుంకుమ పూజలు, అక్టోబర్ 9న ఊరేగింపు, అక్టోబర్ 12న అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా ఆలయ అర్చకులు రాట పాతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు బళ్ల సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల ఏర్పాట్లకు శ్రీకారం



పందిరి రాట పాతుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభోత్సవానికి బుధవారం పలు ప్రాంతాల్లో శ్రీకారం చుట్టి పందిరి రాట పాతారు. స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద ఉన్న కనకదుర్గమ్మతల్లి ఆలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు నడివింటి ఆనందరావు రాట ముహూర్తం చేశారు. స్థానిక గాంధీనగర్‌లోని అమ్మవారి ఉత్సవాలకు రాటా పాతి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, రూరల్ బ్యాంక్ త్రిసభ్యకమిటీ సభ్యుడు ఊడిగ శ్రీనివాస్, పొట్లూరి రాజేష్, మజ్జి నాగరాజు, పొడ్డిని రాంబాబు, మంగరాజు రాజు, మీసాల వీరభద్రరావు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

ఆకివీడు: పట్టణంలో అర్ధ సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నుల్ని ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించాలని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బకాయిలు, అర్ధ సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులన్నింటినీ చెల్లించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారీ అన్నసమారాధన



కుమ్మర్ల వీధిలో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దైవారాధన మించి భక్తిభావం మరొకటి లేదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 31వ వార్డు కుమ్మర్ల వీధిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి రామాలయం వద్ద శ్రీవరసిద్ధి వినాయక చవితి 13వ వార్షిక మహోత్సవంలో భాగంగా సీతారామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు, తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మహా నివేదనకు హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి రణభేరి



రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాళ్ల: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు రణభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ కాళ్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బీఆర్ఎంకే స్వామి, ఎం.శంకరరావు తెలియజేశారు. ఈ మేరకు గ్రామంలో రణభేరి పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 15 నెలల గడిచినా ఏ ఒక్క సమస్యకు చెప్పుకోదగిన పరిష్కారం లభించటం లేదని పైగా బోధనేతర పనులు కూడా ఎక్కువ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 25న విజయవాడలో భారీ బహిరంగ సభ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు.

గుక్కెడు మంచినీళ్లు ఇప్పించరూ..!

- భీమవరం టిడ్కో ఇళ్ల వద్ద సమస్యల తిష్ట
- వెదజల్లుతున్న దుర్గంధం
- విజృంభిస్తున్న దోమలు



మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన టిడ్కో మహిళలు



మంచినీటి సమస్య ఉన్న భీమవరంలోని టిడ్కో ఇళ్ల సముదాయం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో టిడ్కో ఇళ్ల సముదాయంలో మంచినీరు, చెత్త సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటి సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. మంచినీళ్లు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఇక్కడి అపార్ట్‌మెంట్స్‌లో ఎక్కడి చెత్త అక్కడ ఉంటోందని, దోమలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేద వ్యక్తం చేశారు.

చెత్త, చెదారంతో దోమల విజృంభణ

టిడ్కో ప్లాట్లు నుంచి వచ్చే చెత్త, చెదారాన్ని సకాలంలో పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడం లేదని దాంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. అలాగే డ్రెయినేజీలు సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్య, చెత్త, చెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



టిడ్కో సముదాయంలో ఉన్న ఇళ్లకు మంచినీరు సక్రమంగా అందడం లేదు. పైపులు ద్వారా మంచినీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి సమస్యతో నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి. **ఎస్, శారద టిడ్కో, లబ్ధిదారురాలు**

చెత్త, చెదారం వెంటనే తొలగించాలి



టిడ్కో ప్లాట్లు నుంచి వచ్చే చెత్త, చెదారాన్ని సకాలంలో పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడం లేదు. దీంతో దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నాం. దీంతో అనారోగ్యాల పాలవుతున్నాం. వెంటనే అధికారులు స్పందించి చెత్త సమస్యలను పరిష్కరించాలి. మున్సిపల్ అధికారులు తరుచూ పర్యటించి టిడ్కో సమస్యలపై దృష్టి పెట్టాలి. **యు. మరియమ్మ టిడ్కో లబ్ధిదారురాలు**

భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలి

భీమవరం: భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్‌కుమార్ తెలిపారు. భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని ప్రకాశంచౌక్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టిన జవ్వాది సత్యనారాయణ, రాట్నాల శ్రీనివాస్‌కు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. భీమవరం ఏఎంసీలో కలెక్టరేట్ భవనాలు నిర్మించాలన్నారు. కలెక్టరేట్ మరోచోటికి తరలించేయత్నం మానుకోవాలని అన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

పాలకోడేరు: చదువుకునే విద్యార్థులందరికీ తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పశ్చిమ డెల్టా నీటి సంఘం అధ్యక్షులు కునాధరాజు మురళీకృష్ణ అన్నారు. బుధవారం పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులందరికీ కూనధరాజు మురళీకృష్ణంరాజు 50వేల రూపాయల వ్యయంతో యూనిఫామ్, ఐడెంటి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ రాజశేఖర్ రాజు, ఎస్ఎంసీ సభ్యులు గొట్టుముక్కల రాము, విద్యా కమిటీ చైర్మన్ చెల్లంకి మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: బధిరులు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడేందుకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం భీమవరం డీఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ రామకృష్ణ సభ భవన్ నందు శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాల 35వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాలను 1985 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ ప్రారంభించడం జరిగిందన్నారు. 150 మంది వరకు విద్యార్థులు చదువుకునేవారని, నేడు 75 మంది మాత్రమే చదువుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో బధిర వైకల్యం కలిగిన వారిని గుర్తించి ఈ పాఠశాలలో చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. దివ్యాంగులకు సహజ సిద్ధంగానే తెలివితేటలు అధికంగా ఉంటాయన్నారు. చదువు చాలా అవసరమని, చదువుకోకపోవడమే ఒక నిజమైన వైకల్యం అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తొలుత బధిర విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనకు జిల్లా కలెక్టర్ ముగ్ధులై విద్యార్థులను అభినందించారు. చాలా చక్కగా అభినయంతో కూడిన నృత్య ప్రదర్శన చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బధిర పాఠశాల మాజీ సభ్యులు పేరిచర్ల లక్ష్మణవర్మ, డీఎన్ఆర్ కళాశాల అధ్యక్షుడు జి.వి నరసింహారాజు, కరస్పాండెంట్ జి.సత్యనారాయణ రాజు, గన్నాబత్తుల తులసమ్మ పెదతాత ట్రస్ట్ అధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, బధిరుల సంఘం జిల్లా చైర్మన్ చెరుకువాడ రంగసాయి, శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.తిరుపతిరావు, రాష్ట్ర చెవిటి సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మీనారాయణ, ట్రాన్స్ లేటర్ కే రాజు కె.రాజు, ఆహ్వాన కమిటీ వైస్ చైర్మన్ జి.శ్రీనివాసరాజు, ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్ వర్మ, అసోసియేట్ ప్రెసిడెంట్ జి. గంగాధరన్, జనరల్ సెక్రటరీ సిహెచ్.తాతారావు, మాజీ ప్రిన్సిపాల్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, పూర్వపు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక





వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆంజనేయరాజు, పెదవీరప్ప

ఉండి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వాండ్రం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, మండల వ్యవసాయ సలహాసంఘ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ తాటిపట్టి పెదవీరప్ప బుధవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై మాజీ సీఎం జగన్‌కు వివరించినట్టు చెప్పారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



వాలీబాల్ కోర్టులను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్

భీమవరం: కళాశాలలు విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తే విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఎంతో వృద్ధి సాధిస్తారని జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం ఒకేసారి రెండు వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి ఎస్ ఆర్ కే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌కెఆర్ క్రీడల్లో కూడా మంచి ప్రగతి సాధించడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో రాష్ట్రస్థాయి, జోన్ స్థాయి క్రీడా పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్రికెట్ అకాడమీ ఏర్పాటు కూడా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు వైస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె వి మురళీకృష్ణంరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో ఇటీవల పింక్ బాల్ కోర్టు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ కళాశాలలోని ఐడియా ల్యాబ్ లో జరుగుతున్న పరిశోధనలు స్వయంగా పరిశీలించి అక్కడ విద్యార్థులను అభినందించారు. వెట్ సెంటర్లో స్టార్టప్ ద్వారా విద్యార్థులు చేస్తున్న కృషిని డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ఎన్ గోపాలకృష్ణ మూర్తి వివరించారు. అనంతరం వెట్ సెంటర్లో జరుగుతున్న పరిశోధనలను కూడా పరిశీలించి అక్కడ శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని అభినందించారు. ఆయనతోపాటు హేకథాన్ సెమీఫైనల్స్ కు చీఫ్ అబ్జర్వర్ గా వచ్చిన డాక్టర్ పి అనిల్ కుమార్ కూడా ఆయన వెంట ఉన్నారు.

సమాజ ప్రగతిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

వీరవాసరం: సమాజం ప్రగతి పథంలో నడవాలంటే ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే సాధ్యమవుతుందని రాయకుదురు గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి తెలిపారు. మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 2 ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావుకు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. చక్కటి విద్యా బోధనతో ఉపాధ్యాయులంతా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులంతా మంచి విద్యాభ్యాసంతో జీవితంలో రాణించాలని తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కానుకొలను శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అందరికీ పాఠశాల ఉపాధ్యాయులు గజేంద్ర గట్కారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన స్టడీ మెటీరియల్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ మాజీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ, కాయల వీరాస్వామి, గజేంద్ర గట్కారి, కేవిడి ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు ,వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న భీమవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రావి రాంబాబు

భీమవరం: ఈనెల 14వ తేదీన భీమవరంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్ని రకాల వైద్య పరీక్షలను 10 మంది వైద్యులచే ఉచితంగా చికిత్సలు అందించడం గొప్ప విశేషమని అన్నారు. వండర్ కిడ్స్ స్కూల్ చైర్మన్ అల్లు రామకృష్ణ, వినాయక హాస్పిటల్ డాక్టర్ సీవీఆర్ గజపతిరాజు మాట్లాడుతూ ఈనెల 14న మెంటే వారి తోటలోని వండర్ కిడ్స్ స్కూల్ వద్ద ఉదయం 9 గంటల నుంచి వినాయక హాస్పిటల్, వండర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, అన్ని వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్, ప్రేగు, బిపి, షుగర్, థైరాయిడ్, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధి సమస్యలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత కళ్లజోళ్లు, ఆపరేషన్లు కూడా చేయిస్తామని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ అధికారులు, వినాయక హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు సామూహిక ఎలుకల నిర్మూలన

పాలకోడేరు: వరిలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మండలవ్యాప్తంగా గురు, శుక్ర వారాల్లో నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి బి.సంధ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రైతులు ఎలుకల బొరియలను గుర్తించాలని, శుక్రవారం అన్ని గ్రామాలలో రైతు సేవ కేంద్రం ద్వారా బ్రోమోడియోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆ మందును రైతులు ఎలుకల బొరియల్లో పెట్టి పూడ్చి వేయడం ద్వారా సామూహిక ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని వివరించారు.

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



చినఅమిరంలోని హైస్కూల్లో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించిన దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు చిరుప్రాయంలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామ పెద్ద గొట్టుముక్కల శివరామరాజు అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 10లో అత్యధిక మార్కులు సాధించిన ఏఎస్ఎస్‌వీఆర్ కార్తీక్ (572) ప్రథమ, జి. సత్య ప్రకాష్, (572) ద్వితీయ, డి లోకేష్ సత్య (559) తృతీయ స్థానాలతో పాటు 9, 8వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం దాతలు గొట్టుముక్కల మురళీకృష్ణంరాజు, ఆయన తండ్రి వెంకట భీమరాజులు రూ. లక్ష నగదు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద గొట్టుముక్కల భీమరాజు మాట్లాడుతూ దాతలు అందించిన వసతులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు వేగేశ్న అనురాధ మాట్లాడుతూ దాతలు మురళీకృష్ణంరాజు, భీమరాజులు విద్యార్థులకు ఇటువంటి నగదు, ప్రతిభాపురస్కారాలు అందివ్వడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఏ తారకేశ్వరి, బి. రామకృష్ణ, పరువు ప్రసాద్, దండు బాపిరాజు, జె. శకుంతల, డి. గీతాలక్ష్మి, బి. రాము, ఏ అప్పన్న, సీహెచ్ లక్ష్మీపతిరాజు, జీవీ మణికుమారి, డి. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులని ఓపీఎస్‌లోకి మార్చాలి



ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మండలం ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం మండలంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు జి. ప్రకాశం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, 12వ పిఆర్సీ కమిమిషన్ నియమించి, 30% మధ్యంతర భృతి చెల్లించాలని, మెమో నెంబర్ 57 ప్రకారం సీపీఎస్ ఉద్యోగులని ఓపీఎస్‌లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం మండల అధ్యక్షుడు ఐ. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి. పీటర్, జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, మండల కార్యదర్సులు అరిగేల ఏసేపు, తాళ్లూరు ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి



దొడ్డనపూడి కేశవస్వామి దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న వీరన్నబాబు

కాళ్ల: నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్ అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో ఉన్న శ్రీ కేశవస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా ఆరేటి వీరన్నబాబు, సభ్యులుగా కె.సీతామహాలక్ష్మీ, ఎం.రాజారావు, జి.వెంకటసత్యనారాయణ, డి.వెంకటేష్, ఎస్.సూర్యనారాయణ, ఎం.లీలాపార్వతీదేవి,ఎస్.భూలక్ష్మి, జె.లక్ష్మీలతో పాటు ఎక్స్‌అఫి షియో మెంబరుగా ఎస్.అనంతవెంకట కృష్ణమాచార్యులుతో దేవాదాయ ధర్మదాయ శాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన టెక్నాలజీతోనే ఆర్థిక ప్రగతి



ఎస్ఆర్‌కేఆర్‌లో మాట్లాడుతున్న జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్

భీమవరం: సాంకేతిక ప్రగతి తోనే భారతదేశం సాంకేతిక పరంగా అభివృద్ధి చెందడంతో జీడీపీలో ప్రపంచంలో మూడవ అగ్రరాజ్యంగా నిలిచిందని జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల రీజనల్ సెంటర్లో అమరావతి క్వాంటం వ్యాలీ హేక్తాన్2025 సెమీఫైనల్స్‌కు అయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ, కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, కళాశాల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ దిలీప్ చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణం రాజు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, పి రవి కిరణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

12న బీజేపీ అధ్యక్షుడి పర్యటన

భీమవరం: భీమవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 12న (శుక్రవారం) నిర్వహించనున్న సారథ్యం యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి కోరారు. బుధవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో మాధవ్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించారు.

పాఠశాలకు గ్యాస్ స్టౌవ్, విద్యార్థులకు షూస్ వితరణ

ఉండి: మండలంలోని కలిగొట్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు అవసరమైన గ్యాస్ స్టౌవ్ పాడవడంతో కొత్త గ్యాస్ స్టౌవ్‌ను, పాఠశాలలో 15 మంది విద్యార్థులకు బూట్లు తన సొంత ఖర్చుతో ఉపాధ్యాయురాలు వర్ధనపు యానీచరిత అందజేశారు. వీటిని బుధవారం విద్యార్థులతో పాఠశాల సిబ్బందికి అందించారు.